# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 23 ఫిబ్రవరి 2026


## రోడ్డు ప్రమాద ఘటనలపై తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు

### -ఏఎస్‌పి సాయి కిరణ్ ఐపీఎస్



**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 22.( నినాదం ):** మొన్న జరిగిన ఒక ఘటనలో కారులో వెళ్తున్న వారు ఒక వ్యక్తిని ఢీకొనడంతో అతని కాలికి గాయం అయింది. అక్కడే ఉన్న మరో వ్యక్తి కారులో ఉన్న వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ, "చూసుకుని వెళ్లాలి కదా" అని వాగ్వాదానికి దిగాడు. అనంతరం కోపంతో కారును డ్యామేజ్ చేశాడు.పోలీసులకు ఫిర్యాదు అందిన వెంటనే ఇరుపక్షాలపై వేర్వేరుగా కేసులు నమోదు చేయబడ్డాయి. ప్రమాదానికి కారణమైన కార్ డ్రైవర్‌పై ఒక కేసు, కారుపై దౌర్జన్యం చేసి కారును డ్యామేజ్ చేసిన వ్యక్తిపై మరో కేసు నమోదు చేయబడింది. ఇద్దరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోబడుతున్నాయి. ఈ సాధారణ రోడ్డు ప్రమాదాన్ని రెండు వర్గాల మధ్య జరిగిన ఘటనగా చూపిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఇలాంటి అసత్య ప్రచారం చేసి ప్రజల్లో అపోహలు కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయి.

## చింపాంజీ వేషాదరణలతో కోతులు పరారు

### -న్యూ పోచంపాడ్‌లో వినూత్న ప్రయోగం



**నిర్మల్ ప్రతినిధి,( సోన్ )ఫిబ్రవరి 22 (నినాదం):** నిర్మల్ జిల్లా కేంద్రంలోని న్యూ పోచంపాడ్ గ్రామంలో కోతుల బెడదను అరికట్టేందుకు గ్రామ సర్పంచ్ మరియు ప్రజలు కలిసి ఒక వినూత్న ప్రయోగాన్ని చేపట్టారు. గ్రామంలో రోజురోజుకు కోతుల సంఖ్య పెరిగిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో చింపాంజీ వేషధారణతో కోతులను భయపెట్టి ఊరి నుండి అడవిలోకి తరిమివేయడం విశేషం.గ్రామంలో కోతులు పంట పొలాలపై పడి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, ఇళ్లలోకి దూరి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా మనుషులపై దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇంటి పైకప్పులను పాడుచేయడం, నీటి ట్యాంకులు మరియు కరెంటు స్తంభాల వైర్లను తెంపివేయడం వంటి చర్యలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని, అందుకే ఈ వినూత్న ఆలోచనతో కోతులను ఊరి నుండి వెళ్లగొట్టామని వారు తెలిపారు.గ్రామంలో కోతులతో పాటు కుక్కల బెడద కూడా విచ్చలవిడిగా పెరిగిపోతోందని, పంటలకు రక్షణ లేకుండా పోతోందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సమస్య నుండి విముక్తి పొందేందుకు చింపాంజీ వేషధారణ వేసి కోతులను విజయవంతంగా అడవిలోకి పంపగలిగారు. ఈ వినూత్న కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ మల్లయ్య, వీడిసి సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశువుల డాక్టర్ నిర్లక్ష్యానికి బర్రె మృతి..!

### -తిప్పని రాములు రైతుకి లక్ష రూపాయల ఆర్థిక నష్టం..!

### -రైతుకు న్యాయం చేసి, ఇందుకు కారణమైన వైద్యుని పై చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్..!





**రామగుండం ఫిబ్రవరి 22 (నినాదం):** లింగాపూర్ గ్రామానికి చెందిన తిప్పని రాములు అనే రైతు పశువైద్యుని నిర్లక్ష్యంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు... తన బర్రె గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా సంబంధిత పశువైద్యునికి సమాచారం అందించినప్పటికీ, సకాలంలో స్పందించకపోవడంతో బర్రె మృతి చెందిందని తెలిపారు.రైతు రాములు మాట్లాడుతూ, వైద్యులు పల్లె ప్రసాద్ కి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకుండా, ఫోన్ ఎత్తకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే తన పశువు ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. ఈ ఘటన కారణంగా తనకు సుమారు లక్ష రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, వైద్యులు పల్లె ప్రసాద్ పై తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే తనకు న్యాయం చేయాలని రైతు డిమాండ్ చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## కుల అహంకారానికి పసికందును బలి తీసుకున్న వారిని వెంటనే శిక్షించాలి


### -కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎ.పరంజ్యోతి డిమాండ్.

**నాగర్ కర్నూల్ నినాదం :** జిల్లా కుమ్మెర గ్రామంలో నాలుగు రోజుల క్రితం టికెట్ లేకుండా గుడిలోకి ప్రవేశించిన కారణంగా చాకలి కులస్తులు అయిన గణేష్ చంద్రకళ మౌనికలపై అదే గ్రామానికి సంబంధించిన సర్పంచ్ తూకారాం రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధు రెడ్డి, వర్గమంతా కలిసిఇష్టం వచ్చినట్టుగా వారిపై బూతులు తిడుతూ దూరహంకారంతో అతి కిరాతకంగా భయంకరంగా వారిపై దాడి చేశారు.మరియు రెండు నెలల పసి బిడ్డను కాలుతో తన్ని చంపేశారురెడ్ల దురహంకారానికి కెవిపిఎస్ సంఘం తీవ్రంగా ఖండిస్తూ నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జోగులాంబ గద్వాల జిల్లా కుల వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షులు పరంజ్యోతి డిమాండ్ చేశారు.

## సీపీఎం నాయకుడు రేపల్లె దేవదాసును పరామర్శించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 22( నినాదం):** కర్నూలు పట్టణంలోని జెమ్ కేర్ కామినేని ఆసుపత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ తో వైద్యం పొందుతున్న జోగులాంబ గద్వాల జిల్లా సీపీఎం నాయకుడు రేపల్లె దేవదాసు ను ఆదివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు శ్రీరామ్ నాయక్,కిల్లె గోపాల్, ఎండి జబ్బార్, జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, జిల్లా నాయకులు జి.రాజు, సీపీఎం పట్టణ కార్యదర్శులు రాముడు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

# నీటికి జ్ఞాపకశక్తి ఉందా?



భూ ప్రపంచంపై జీవం పుట్టడానికి కారణమైన నీరు కేవలం ప్రాణవాయువు సహా జలజని పరమాణువుల కలయిక మాత్రమే కాదు అది ఒక సజీవ సమాచార భాండాగారం అని ఆధునిక పరిశోధనలు ఘోషిస్తున్నాయి. నీటికి జ్ఞాపకశక్తి ఉంటుందనే వాదన దశాబ్దాలుగా విజ్ఞాన శాస్త్ర ప్రపంచంలో ఒక పెను సంచలనంగా మారింది. మనం మాట్లాడే మాటలు తోపాటు మన ఆలోచనలు అలాగే మన చుట్టూ ఉండే తరంగాలు నీటి అంతర్గత నిర్మాణాన్ని ప్రభావితం చేస్తాయని పలు దేశాల శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా నిరూపించారు. కేవలం భౌతిక ద్రవంగా పరిగణించబడే నీరు తన స్పర్శలోకి వచ్చే ప్రతి వస్తువు యొక్క ప్రకంపనలను నమోదు చేసుకోగలదు. ఆ సమాచారాన్ని భవిష్యత్తుకు మోసుకెళ్లగలదని వాస్తవాలు వెల్లడిస్తున్నాయి. ఈ వింత ధర్మాన్ని అర్థం చేసుకుంటే మన శరీరంలో 70 శాతం ఉండే నీరు మన మనస్తత్వాన్ని ఎలా మార్చగలదో అర్థమవుతుంది. రసాయన శాస్త్ర పరిధిని దాటి నీటిని ఒక ద్రవ రూప స్మృతి చిహ్నంగా చూడాల్సిన సమయం ఆసన్నమైందని అంతర్జాతీయ వేదికలపై మేధావులు చర్చ మొదలుపెట్టారు.

**ఫ్రెంచ్ శాస్త్రవేత్త ప్రకంపనలు:**

నీటికి జ్ఞాపకశక్తి ఉంటుందనే వాదనకు ఆధునిక శాస్త్రీయ పునాది వేసింది ఫ్రాన్స్ దేశపు రోగనిరోధక శాస్త్రవేత్త జాక్వెస్ బెన్వెనిస్టే. 1988 జూన్ 30న ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రీయ పత్రిక ప్రకృతిలో ఆయన ప్రచురించిన పరిశోధనా వ్యాసం వైద్య ప్రపంచాన్ని కుదిపేసింది. హోమియోపతి మందులలో రసాయన మూలకం లేకపోయినా ఆ మందు నీటిలో కలిసినప్పుడు ఆ మూలకం యొక్క నీడ ముద్ర నీటిలో అలాగే ఉంటుందని ఆయన నిరూపించారు. ఆ నీరు తనతో కలిసిన ఔషధం యొక్క శక్తిని గుర్తుంచుకుని శరీరంలో ప్రతిచర్యను చూపిస్తుందని ఆయన ప్రయోగశాల సాక్షిగా వెల్లడించారు. ఆ ప్రయోగం ఆనాడు తీవ్ర విమర్శలకు గురైనప్పటికీ నీటి అణువుల అమరికలో సమాచారం నిక్షిప్తమవుతుందనే ఆలోచనకు మొదటి బీజం వేసింది. ఫ్రాన్స్ దేశపు ప్రతిష్టాత్మక ఆరోగ్య పరిశోధనా సంస్థలో జరిగిన అధ్యయనం నీరు కేవలం వాహకం కాదు అది ఒక సందేశకర్త అని చాటిచెప్పింది. శాస్త్రవేత్తలు మొదట తిరస్కరించినా కాలక్రమేణా నీటి భౌతిక ధర్మాలలో మార్పులను గమనించక తప్పలేదు.

**భావోద్వేగాల దర్పణం నీరు:**

నీటి జ్ఞాపకశక్తిపై దృశ్యరూప ఆధారాలను అందించిన వ్యక్తి జపాన్ దేశపు డాక్టర్ మసారు ఎమోటో. 1990వ దశకంలో ఆయన నిర్వహించిన ప్రయోగాలు నీటిపై మన ఆలోచనల ప్రభావం ఎలా ఉంటుందో స్పష్టంగా చూపించాయి. నీటిని వేర్వేరు భావోద్వేగాలకు అంటే ప్రేమ తోపాటు ద్వేషం అలాగే శాంతి వంటి వాటికి గురిచేసి ఆ తర్వాత ఆ నీటిని మంచులా గడ్డకట్టించి సూక్ష్మదర్శిని కెమెరాలతో చిత్రాలు తీశారు. ప్రేమ వంటి సానుకూల పదాలు విన్న నీరు అద్భుతమైన 6 కోణాల ఆకారపు స్ఫటికాలుగా మారింది. ద్వేషం వంటి ప్రతికూల పదాలు విన్న నీరు చిందరవందరగా అలాగే అసహ్యకరంగా మారడం గమనించారు. జర్మనీలోని స్టట్‌గార్ట్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కూడా ఇదే విధమైన ఫలితాలను పొందారు. ఒకే నీటి పాత్రలో వేర్వేరు విద్యార్థులతో నీటి చుక్కలను వేయించి వాటిని పరిశీలించినప్పుడు ఒక్కో విద్యార్థి వేసిన చుక్కలు ఒకే రకమైన ఆకృతిని ప్రదర్శించడం చూసి వారు ఆశ్చర్యపోయారు. ఇది నీటి అణువుల అమరికలోని క్రమశిక్షణను తోపాటు వ్యక్తిగత శక్తి తరంగాలను గుర్తించే సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది.

**నోబెల్ గ్రహీత జన్యు ప్రయోగం:**

హెచ్ ఐ వి వైరస్‌ను కనుగొన్నందుకు నోబెల్ బహుమతి పొందిన ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూక్ మాంటాగ్నియర్ 2009లో నీటి జ్ఞాపకశక్తికి సంబంధించి మరో అద్భుతమైన ప్రయోగాన్ని ప్రపంచం ముందు ఉంచారు. ఒక సీసాలోని నీటిలో ఉన్న జన్యు సంకేత సమాచారాన్ని విద్యుదయస్కాంత తరంగాల ద్వారా మరో సీసాలోని స్వచ్ఛమైన నీటిలోకి బదిలీ చేయవచ్చని ఆయన నిరూపించారు. ఆ స్వచ్ఛమైన నీరు ఆ జన్యు సంకేత తరంగాలను గుర్తుంచుకుని తనలో ఆ జీవకణం యొక్క ప్రతిరూపాన్ని సృష్టించుకోవడం శాస్త్రవేత్తలను విస్మయానికి గురిచేసింది. ఇది నీరు సమాచారాన్ని ఒక చోటు నుండి మరో చోటుకు చేరవేయగలదని అదృశ్య ముద్రలను భద్రపరుచుకోగలదని శాస్త్రీయంగా ధృవీకరించింది. భౌతిక పదార్థం లేకపోయినా సమాచారం బదిలీ అవ్వడం వెనుక ఉన్నది నీటి జ్ఞాపకశక్తి అని ఆయన గట్టిగా వాదించారు. మానవ మెదడులో 85 శాతం తోపాటు గుండెలో 73 శాతం నీరు ఉంటుంది. అంటే మనం తాగే నీరు మన ఆలోచనలకు ప్రతిబింబంగా మారుతోంది. తీర్థం లేదా పవిత్ర జలం అనే భావనలో నీటికి సానుకూల తరంగాలను ఎక్కించడం అనే రహస్యం దాగి ఉంది.నీటి జ్ఞాపకశక్తి సిద్ధాంతం నిజమైతే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఔషధ కంపెనీల పునాదులు కదులుతాయి. కేవలం నీటి తరంగాల ద్వారా రోగాలను నయం చేసే సాంకేతికత అందుబాటులోకి వస్తే వేల కోట్ల రూపాయల మందుల వ్యాపారం కుప్పకూలుతుంది.

## ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

### -'ఖని' టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు

### - షిర్కే బస్ స్టాండ్ లో అరైవ్-అలైవ్ పై అవగాహన



**యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 22, (నినాదం):** ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు అన్నారు.రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఆదివారం స్టేషన్ పరిధిలోని షిర్కే బస్ స్టాండ్ లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రైవింగ్ నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం కేవలం ఒక నినాదం కాకుండా.. రోడ్డు ప్రమాదాలను నివారించే ఉద్యమంలా ముందుకు సాగాలన్నారు. ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరాలనే వారి కుటుంబ సభ్యుల ఆశను తీర్చే కార్యక్రమం కావాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురయ్యే బాధితుల బాధ, మరణం సంభవించిన వారి కుటుంబ సభ్యుల మనోవేదన వర్ణనాతీతం అన్నారు. అలాంటి పరిస్థితి మరో కుటుంబంలో జరగకుండా..అందరూ రహదారి భద్రత నియమాలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. హెల్మెట్ ధరించడం కేవలం చలానా, చట్టం నుంచి తప్పించుకోవడానికి కాదని.. అది తమ ప్రాణాన్ని కాపాడే ఆయుధమని ప్రతి వాహనదారుడు గ్రహించాలనిసూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం రోడ్డు ప్రమాద మరణాలు జరిగి, ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చే బాధ్యతను గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు, యువత పాల్గొన్నారు.

## కార్పొరేటర్ శంకర్ నాయక్‌కు ఉద్యోగుల ఆత్మీయ సన్మానం



**యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 22, (నినాదం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్ గా గెలుపొందిన ఐ.ఎన్.టి.యు.సీ అర్జీ-2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ బదావత్ శంకర్ నాయక్ ను ఓసీపీ-3 రిలే-బి ఉద్యోగులు సన్మానించారు. ఆదివారం ప్రాజెక్టు కృషి భవన్ లో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన కార్యక్రమంలో అధికారులు,ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులతో కలిసి పూలమాలలతో సత్కరించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రాజెక్టు సెక్రటరీ కొంగర రవీందర్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాలిగామ మల్లేశ్, బ్రాంచ్ సెక్రెటరీ తోకల సమ్మయ్య, ఇట్ల శ్రీనివాస్, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ ఎండి అక్రమ్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణ రెడ్డి, సెంట్రల్ జాయింట్ జనరల్ సెక్రెటరీ నాచగొని దశరథం గౌడ్, బ్రాంచ్ సెక్రెటరీ ఆకుల రాజిరెడ్డి, వాసాల అశోక్, సలిగంటి రాములు, రెడ్డి రాజుల తిరుపతి, జనార్దన్ రెడ్డి, ఉదయ్,వర్క్ షాప్ ఫిట్ సెక్రెటరీ వంగ సురేష్, ఆవుల లక్ష్మణ్, గోపాలరావు,వేల్పుల తిరుపతి కంది శ్రీనివాస్,ఈశ్వర్ రెడ్డి, పోచంపల్లి మధు, గుర్రం రవి, అనిల్ నాయక్, సుదర్శన్, చేరాలు,ఉదయ్, మంథని సంపత్, శ్రీనివాస్,తాళ్లపల్లి శ్రీకాంత్, గట్ల తిరుపతిరెడ్డి, ఆకునూరి రాజయ్య, జాల వెంకటరామిరెడ్డి,కొమరన్న, అనిల్,పూరేళ్ల శీను, రాజకుమార్, మధుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా మొదలైన రెండవ దశ అరైవ్ - అలైవ్ 2026





**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 22.( నినాదం):** ప్రజల ప్రాణ భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని ఈరోజు నుండి "అరైవ్ అలైవ్ 2026" కార్యక్రమం ప్రారంభమైంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు.అరైవ్ అలైవ్ మొదటి రోజు లో భాగంగా ఆదివారం జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టబడింది. దీనిలో భాగంగా రోడ్డు భద్రతపై ఎస్ హెచ్ ఓ లు, పోలీసు సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించచారు, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో హెచ్చరిక సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు.ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై మైక్ ప్రకటనలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.హెల్మెట్ ధరించడం,సీట్‌బెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం నివారణ, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా తెలియ జేశారు.ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలి, "సురక్షితంగా వెళ్లి సురక్షితంగా చేరడం" ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ప్రజలకు తెలియ జేశారు.

## మంత్రి పై బిఆర్ఎస్ నాయకుల ఆగ్రహం



**చెన్నూరు ఫిబ్రవరి 22 (నినాదం) :** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణ ప్రెస్ క్లబ్ లో బి ఆర్ఎస్ నాయకులు ఆదివారం పత్రిక సమావేశం నిర్వహించారు సమావేశంలో బి ఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై అక్రమ కేసులు బనాయించి శునకానందం పొందుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి కు ప్రజా కోర్టులో శిక్ష తప్పదు అని రాజ్యాంగాన్ని ఖూనీ చేసి నిజాం నిరంకుశ పాలన కొనసాగిస్తున్న మంత్రి పాలనను ప్రజలు గమని స్తున్నారు అని అన్నారు ప్రజల తీర్పును శిరసా వహించి కేతనపల్లి మున్సిపాలిటీలో రాజ్యాంగ బద్ధంగా చైర్మన్ వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ కొనసాగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని బి ఆర్ఎస్ నాయకులు లేకపోతే రానున్న రోజులలో బిఆర్ఎస్ పార్టీ తరపున భారీ ఎత్తున నిరాశనలు చేపడతామని అన్నారు ఈ సమావేశం లో చెన్నూరు, కోటపెల్లి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### -14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్



**చేవెళ్ల ఫిబ్రవరి 22 (నినాదం):-** చేవెళ్ల మున్సిపాలిటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రేపు చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్లో నిర్వహించనున్న సన్మాన కార్యక్రమ సభను విజయవంతం చేయాలని చేవెళ్ల మున్సిపాలిటీ 14వ వార్డు సభ్యుల మద్దెల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సన్మాన సభ ఉంటుందని, ఈ సభలో చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారు శైలజాఆగిరెడ్డి, బక్క రెడ్డి మాధవియాదిరెడ్డి సోలిపురం సుచితబల్వంత్ రెడ్డి, దావల్ గారి గోపాల్ రెడ్డి, మంగలి కళ్యాణియాదగిరి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింహులు, కృష్ణ నాయక్ లకు సన్మాన కార్యక్రమం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, కార్యకర్తలు నాయకులు, మున్సిపల్ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విద్యావంతం చేయాలని కోరారు.

## నిస్తేజ నవ భారతం.. పాలకుల నిర్లక్ష్యానికి ఇది సజీవ సాక్ష్యం!

ప్రపంచ యవనికపై భారతదేశం అగ్రగామిగా వెలుగుతోందని, ఆర్థిక వ్యవస్థలో దూసుకుపోతోందని పాలకులు ఊదరగొడుతున్న ప్రగల్భాల వెనుక ఒక భయంకరమైన నిశీధి దాగి ఉంది. అది 'నెత్తురు లేని భారతం'. దేశ భవిష్యత్తుకు వారసులవ్వాల్సిన కోట్లాది మంది చిన్నారులు, మాతృమూర్తుల నరాల్లో రక్తం ఉరకలేయాల్సింది పోయి, రక్తహీనతతో వెలవెలబోతుండటం చూస్తుంటే మనం అభివృద్ధి చెందుతున్నామా లేక అధోగతికి చేరుతున్నామా అన్న సందేహం కలగక మానదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడించిన గణాంకాలు కేవలం అంకెలు కావు, అవి మన దేశ ఆరోగ్య వ్యవస్థ వైఫల్యానికి పదునైన అక్షర రూపులు. సగానికి పైగా మహిళలు, మెజారిటీ చిన్నారులు రక్తహీనతతో కునారిల్లుతున్నారంటే, అది వ్యవస్థల అసమర్థతకు పరాకాష్ట. ఈ నిస్సత్తువ వెనుక పాలకుల నిర్లక్ష్యం, అధికార యంత్రాంగపు వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

**అభివృద్ధి ఆడంబరం.. ఆకలి భయంకరం**

మనం ఉపగ్రహాలను నింగిలోకి పంపిస్తున్నాం, అతివేగ ప్రయాణ సాధనాల గురించి కలలు కంటున్నాం. కానీ, ఈ దేశంలోని సగటు పేదవాడి కంచంలో నేటికీ పోషకాహారం ఒక కలగానే మిగిలిపోయింది. రక్తహీనత అనేది కేవలం ఒక ఆరోగ్య సమస్య కాదు, అది ఒక నిశ్శబ్ద హంతకి. శరీరంలో రక్తం తగ్గి, నిస్సత్తువ ఆవహించి, బతకలేక బతుకుతున్న కోట్లాది మంది తల్లుల ఆక్రందన ఈ సమాజానికి వినిపించడం లేదా? గర్భం దాల్చిన తల్లి రక్తహీనతతో ఉంటే, పుట్టబోయే బిడ్డ మేధస్సు ఎలా ఉంటుంది? రేపటి తరం మేధోహీనులుగా, బలహీనులుగా మారితే మనం ఏ 'విశ్వగురువు' పదవి కోసం పాకులాడుతున్నాం? పోషకాహార భద్రత కల్పించలేని రాజ్యాలు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టి ఆడంబరాలు చేసినా అవి వృథా ప్రయాసలే అవుతాయి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి నిర్మించే ఏ సామ్రాజ్యమైనా పేకమేడలా కూలిపోక తప్పదు.

**విషవలయంలో బాల్యం భవిష్యత్తుపై గొడ్డలి పెట్టు**

చిన్నారుల్లో రక్తహీనత పెరగడం అంటే దేశపు పునాదులనే కూల్చివేయడమే. ఐదేళ్లలోపు చిన్నారుల్లో ఈ సమస్య అధికమవ్వడం వెనుక ఉన్నది కేవలం అనారోగ్యం కాదు, అది పాలకుల అపసవ్య విధానాల ఫలితం. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్య కార్యకర్తల వ్యవస్థను బలోపేతం చేయకుండా, వారికి కనీస గౌరవం ఇవ్వకుండా, కాగితాల మీద లెక్కలు చూపించి 'అంతా బాగుంది' అని భ్రమపడటం ఆత్మవంచన అవుతుంది. నులిపురుగుల నివారణ నుంచి సరైన సమతుల్య ఆహారం అందించే వరకు ప్రతి దశలోనూ నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. పిల్లల పొట్ట కొట్టి, వారి ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సంపాదించే లాభాలు ఏ దేశాన్నీ ఉద్ధరించవు. బడిలో పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యతను గాలికి వదిలేసి, స్వార్థపరుల జేబులు నింపే సంస్కృతి నశించినప్పుడే ఈ దేశానికి పట్టిన పీడ విరగడవుతుంది. బక్కచిక్కిన శరీరాలతో, జీవం లేని కళ్లతో పాఠశాలలకు వచ్చే చిన్నారులు ఈ దేశపు భవిష్యత్తుకు సంకేతాలా? అని పాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి.

**సామాజిక బాధ్యతారాహిత్యం విచక్షణ లేని జీవనశైలి**

రక్తహీనత అంటే కేవలం పేదరికానికి ప్రతిరూపం అనుకుంటే పొరపాటే. ఇది సంపన్న వర్గాల్లో కూడా వేళ్లూనుకుంది. విదేశీ ఆహారపు అలవాట్లకు బానిసలై, ఆకర్షణీయమైన ప్రకటనల మాయాజాలంలో చిక్కుకుని, మన నేల మీద దొరికే సహజ సిద్ధమైన పోషకాహారాన్ని విస్మరించడం వల్ల కలిగే నష్టం తక్కువేమీ కాదు.